క్లుప్తంగా

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పోస్టల్ ఓట్లు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్

నరసాపురం : నరసాపురం పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రెండో రోజు మంగళవారం 601 ఓట్లు పోలైనట్టు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ చెప్పారు. మొదటి రోజు 881 ఓట్లు పోలయ్యాయని వివరించారు. ఇప్పటివరకూ మొత్తం 1489 పోల్ అయినట్టు చెప్పారు. వైఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పోలింగ్ నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.

మారిన వాతావరణం.. రైతుల ఆందోళన



మొగల్తూరులో మబ్బులతో కూడిన వాతావరణం

మొగల్తూరు : గత కొద్ది రోజులుగా ఎండ వేడితో అల్లాడుతున్న ప్రజలు మంగళవారం కాస్త ఉపశమనం పొందారు. వాతావరణంలో మార్పులు కారణంగా నాలుగు రోజులు పాటు ఉరుములతోకూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలకనుగుణంగా మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మబ్బులు, చిరుజల్లులతో వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు ఊపిరిపీల్చుకోగా వరి రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. దాళ్వా కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో పాటు కొంత మంది రైతులు తమ ధాన్యాన్ని చేల వద్దే ఉంచారు. దీంతో భారీ వర్షం కురిస్తే ధాన్యం తడిసి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలి



31వ వార్డులో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న శారదావాణి

నరసాపురం: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పెద్ద ఎత్తున కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని ముదునూరి సతీమణి శారదావాణి ప్రజలకు సూచించారు. భర్త గెలుపు కోరుతూ శారదావాణి మంగళవారం పట్టణంలోని 31వ వార్డు చినమాయిడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, నాయకులు బళ్ల తాతాజీ, బళ్ల కృష్ణ, మాదిరెడ్డి ఏసు, తోట సుబ్బారావు, మండలె కొండబాబు తదితరులు ఉన్నారు.

ఇంటింటి పింఛన్‌కు చంద్రగ్రహణం

- ఆరో రోజు పడరాని పాట్లు
- పింఛన్ విత్ డ్రా చేసుకునేందుకు బ్యాంకుల వద్దకు క్యూ
- ఖాతాలు నిలిచిపోవడంతోనే అసలు సమస్య



పింఛన్ లబ్ధిదారులతో రద్దీగా ఉన్న నరసాపురం యూనియన్ బ్యాంక్

నరసాపురం రూరల్: పింఛన్ లబ్ధిదారులు మంగళవారం కూడా పడరాని పాట్లు పడ్డారు. వడగాల్పులను తలపించే ఎండలో వృద్ధులు బ్యాంకుల వద్దకు వెళ్లడానికి అగచాట్లు పడ్డారు. ఇప్పటికే వారం రోజులు గడచినా పింఛన్ దారుల అగచాట్లలో ఎలాంటి మార్పులేదు. అయితే గతంలో (జీరో బ్యాలెన్స్) సున్నా ఖాతాలను వృద్ధులు తెరవడంతో ఆ ఖాతాల్లో ఆర్థిక లావాదేవీలు జరపక పోవడంతో ఖాతాలన్నీ మురిగిపోయాయి. దీంతో బ్యాంక్ అధికారులు లబ్ధిదారుల ఆదార్‌కార్డు తీసుకుని, దరఖాస్తు ఫారం రాసి, స్కాన్ చేసి, వృద్ధుల ఫింగర్ ప్రింట్‌లు తీసుకుని ఖాతాలను మళ్లీ వాడుకలోకి తీసుకువచ్చి వృద్ధుల చేతిలో నగదు పెట్టి పంపిస్తున్నారు. దీంతో కొంత కాలయాపన జరుగుతోంది. 85 ఏళ్లు నిండిన వారికి, అలాగే దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్ అందజేశారు. గత నెలలో అయితే అందరికీ సచివాలయ ఉద్యోగులు పింఛన్లు అందజేశారు. 60 ఏళ్లు నిండిన 85 ఏళ్లు లోపు ఉన్న వృద్ధుల మే నెల పింఛన్ బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో వారంతా ఈ ఎండల్లో పడరాని పాట్లు పడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుని శాపనార్థాలు పెడుతున్నారు. ప్రతి నెలా వలంటీర్లు ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. చంద్రబాబు చెడగొట్టారని నిందిస్తున్నారు. ఇదిలా ఉంటే అద్దె భవనంలో కొనసాగుతున్న నరసాపురం యూనియన్‌బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. దీంతో బ్యాంకు సిబ్బంది, ఖాతా దారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒక పక్క ఎలక్ట్రికల్, సీలింగ్ పనులు జరుగుతుండటంతో దీంతో ఒక ఎండ ఉక్కబోత, బ్యాంకు ఆవరణలో ఫ్యాన్లు, ఏసీలు పనిచేయక పోవడంతో సిబ్బంది, ఖాతాదారులు గగ్గోలు పెడుతున్నారు. పింఛన్ డ్రా చేసుకోవడానికి వచ్చిన వృద్ధులు, వికలాంగుల పరిస్థితైతే వర్ణనాతీతంగా ఉంది.

చాలా ఇబ్బందులు పడ్డాను



మే నెల పింఛన్ డబ్బులు తీసుకోవడం కోసం మూడు సార్లు బ్యాంకు రావాల్సి వచ్చింది. నేను తీసుకునేది వృద్ధాప్య పింఛనే కానీ నాకు షుగరు వ్యాధి ఎక్కువగా ఉండడంతో ఒక కాలును తొలగించారు. ఒంటికాలితో కుంటుకుంటూ వచ్చి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రెండు రోజుల పాటు బ్యాంకు వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. టీడీపీ కుట్రలకు మాలాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడం తగదు.

– మండెల నారాయణరావు, నరసాపురం

వలంటీర్ల సేవలు నాలుగేళ్లుగా ఉన్నవే



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడం కోసం వలంటీర్లను ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల పేరు చెప్పి వలంటీర్ల వ్యవస్థను తొలగించి మాలాంటి వారి ఉసురు పోసుకుంటున్నారు. నాలుగేళ్లగా నడుస్తున్న వ్యవస్థపై ఆంక్షలు విధించి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

– రాపాక పెద్దింట్లు, సీతారామపురం

రాజకీయ దురుద్దేశంతోనే..



చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రాజకీయంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొన లేక పింఛన్లు సక్రమంగా అందితే జగన్ బాబుకే అంతా ఓట్లేస్తారన్న అక్కసుతో పింఛన్లను నిలిపివేసి మాలాంటి వాళ్లందరినీ ఇబ్బందులకు గురి చేశారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే గెలుస్తారు.

– గుత్తుల అన్నపూర్ణ, ఎల్పీచర్ల

చంద్రబాబుకు తగదు



మాలాంటి వృద్ధులు, వికలాంగులకు ఈ రెండు నెలలు పింఛన్ సొమ్ములు సక్రమంగా అందితే చంద్రబాబుకి నష్టం ఏంటి? ఎండల్లో బ్యాంకుల చుట్టు తిప్పి ఆనంద పడుతున్నారు. ఇలా చేయడం చంద్రబాబుకు తగదు.

– దొంగ పద్మావతి, లక్ష్మణేశ్వరం

పేదల సంక్షేమమే జగన్ అజెండా



మంగళగుంటపాలెంలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ప్రసాదరాజు

నరసాపురం రూరల్ : రాష్ట్రంలో పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం నరసాపురం మండలంలోని కొప్పర్రు మంగళగుంటపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వేకువ జాము నుంచే ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు. అందరినీ పలుకరిస్తూనే తమ ప్రభుత్వాన్ని ఎందుకు మళ్లీ గెలిపించాలో? వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను గెలింపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఆయన అందించిన సుపరిపాలనకు ప్రజలు మద్దతివ్వాలన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు.



మంగళగుంటపాలెం గ్రామంలో ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ప్రజల్లో జగనన్నకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో దుష్టచతుష్టయం ఓర్వలేకపోతుందన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు గడపగడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచార కరపత్రాలను అందజేశారు.

తీరనున్న విద్యుత్ వెతలు

- టెండర్ దశకు భారీ విద్యుత్ సబ్‌స్టేషన్
- రూ.133 కోట్లతో 220/132/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం
- రుస్తుంబాదలో 10 ఎకరాల స్థలంలో నిర్మాణం
- రెండు మున్సిపాలిటీలు, 5 మండలాల్లో తీరనున్న లో–ఓల్టేజ్ సమస్య



నరసాపురంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: నరసాపురంలో భారీ విత్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం గతంలోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులు టెండర్ దశకు చేరడంతో త్వరలో ఈ పనులు ప్రారంభం కాబోతున్నాయి. విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో ఈ కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించబోతున్నారు. ప్రభుత్వం ట్రాన్స్‌కో ద్వారా దీనికి సంబంధించి జీఓ నెంబర్–2368ని 2021 ఫిబ్రవరి నెలలో విడుదల చేసింది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి పట్టణంలోని రుస్తుంబాద ప్రాంతంలో 10 ఎకరాలను ఇప్పటికే సేకరించారు.

లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. 2020లో ఆ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకుపెంచారు. ఇప్పుడు అదనంగా అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న కొత్త 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నాయి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతో కాలంగా విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఇబ్బందులు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. ఇప్పుడు ఇక ఈ సమస్యకు చెక్ పడనుంది. నరసాపురం తీరప్రాంతంతో పాటుగా, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లురూరల్ మండలంలోని పరిసరప్రాంతాల్లో విస్తారంగా ఆక్వా సాగు జరుగుతోంది. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లో–ఓల్టేజ్ సమస్యలు కూడా తొలగి నాణ్యమైన విద్యుత్ ఆక్వా రైతులకు కూడా సరఫరా అవుతుంది.

లో–ఓల్టేజీ సమస్యకు పరిష్కారం



కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు టెండర్ దశకు వచ్చాయి. వాస్తవానికి ఇప్పటికే పనులు పూర్తి కావాలి. అయితే కొన్ని కారణాల వల్ల పనులు జాప్యం జరిగింది. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి లోకి వస్తే లో–ఓల్టేజ్ సమస్యలు ఉండవు. భారీ సామర్థ్యంతో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ కట్టడం వల్ల ఇక విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండవు. ముఖ్యంగా తీరగ్రామల్లో ప్రకృతి విపత్తుల సమయంలో విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నాము. వాటన్నిటి నుంచి విముక్తి దొరికింది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ఊరూవాడా ప్రచార జోరు

మొగల్తూరు: రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి పాలన, సంక్షేమం అందించే ప్రభుత్వానికే మీరందరూ ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు కుమారుడు శ్రీ కృష్ణంరాజు, డాక్టర్ అనిర్వన్నలు ఓటర్లను కోరారు. ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని రామన్నపాలెం పంచాయతీలోని పిట్టావారిపేట, ఆకనవారితోట, పిప్పళ్ళవారితోట తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కొనసాగంలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆకన దుర్గ, అయితం ధనలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, నాయకులు కర్రి ఏసుబాబు, అనంత సుబ్రమణ్యం, కుక్కల మోహన్‌రావు, ఆకన దొరబాబు, కట్టా మూర్తి, కుక్కల కరుణాకర్, శ్రీను రాజు, కరింశెట్టి రాంబాబు, మస్తాన్, కొల్లాబత్తుల సత్యానందం, కోడెల్లి వెంకట్రావు, కడలి బాబ్జి, కడలి గోపి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచార జోరు

మొగల్తూరు: మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గృహ సారథులు, బూత్ కన్వీనర్లు మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మొగల్తూరులోని 8వ వార్డులోని 69వ బూత్‌లో ప్రచారం చేపట్టిన గృహసారథులు వేగి బాల, పాలపర్తి జయరాజు, వేగి లక్ష్మీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేసి సగర్వంగా మళ్లీ ఎన్నికల బరిలో నిలిచారన్నారు. ఈ నెల 13న జరుగబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అసెంబ్లీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు, పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బుంగా అశోక్, వేగి శాంతకుమారి, సచివాలయ కన్వీనర్ బుంగ పవిత్ర, విల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ విజయాని కాంక్షిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు గత రెండు రోజులుగా బూత్ లెవెల్‌లో ఇంటింటికీ తిరుగుతూ ఈవీఎం నమూనా, బ్యాలెట్ నమూనాలను ఓటర్లకు చూపుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు ఎలా వేయాలో వివరించే కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ ఓటరూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించి రెండు ఓట్లు వేయాల్సి ఉంటుందని వాటిని పోలింగ్ బూత్‌లకు వెళ్లాకా ఎలా వినియోగించుకోవాలో వివరించే కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని లక్ష్మణేశ్వరం మల్లవరం, చిట్టవరం, రుస్తుంబాద, సరిపల్లి తదితర గ్రామాల్లో వార్డుల వారీగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ కోలపర్తి రామకృష్ణ, మత్తే సువర్ణరాజు, ముద్దాల సురేష్, వీరవల్లి బాలకృష్ణ, బిళ్ల బ్రదర్స్, కడలి ఆదినారాయణ, పండు, కడలి శ్రీను, కవురు రామాంజనేయులు, దేశింశెట్టి సురేష్, కడలి పద్మరాజు, సర్పంచ్ తాడి లక్ష్మణరావు, చల్లా సత్యనారాయణ, కొళ్ల శ్రీను, దొంగ మోహనరావు, వంగలపూడి ఏషయ్య, పాల్గొన్నారు.



రామన్నపాలెం పంచాయతీ పిప్పళ్ళవారితోటలో ఓట్లు అభ్యర్థిస్తున్న శ్రీ కృష్ణంరాజు, డాక్టర్ అనిర్వన్న



మొగల్తూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



చాగంటివారి మెరకలో ప్రచారం చేస్తున్న దృశ్యం



లక్ష్మణేశ్వరం గ్రామంలో నమూనా బ్యాలెట్‌ను ఇంటింటికీ అందజేస్తున్న నాయకులు

నేడు ఎన్నికల ప్రచారం ఇలా

నరసాపురం రూరల్ : సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు బుధవారం ఉదయం 7 గంటల నుంచి నరసాపురం పట్టణం, నరసాపురం మండలాల్లో పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటన విడుదల చేశాయి. అలాగే ప్రసాదరాజు కుమారుడు శ్రీకృష్ణంరాజు బుధవారం ఉదయం 7 గంటల నుంచి వేములదీవి వెస్ట్ పంచాయతీ వేములదీవి పెట్రోల్ బంకు వద్ద నుండీ ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రసాదరాజు సతీమణి శారదావాణి బుధవారం ఉదయం 7 గంటలకు రుస్తుంబాద పంచాయతీ సెవెన్త్‌డే స్కూల్ వద్ద నుంచి ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాలకు చంద్రగ్రహణం



వర్షంలోనూ ప్రచారం చేస్తున్న నాయకులు

పెనుమంత్ర: ఎన్నికల కమిషన్ చంద్రబాబు వర్గీయులు పెడుతున్న పిటిషన్‌లకు వత్తాసుపలుకుతూ సంక్షేమ పథకాలకు చంద్రగ్రహణం పట్టిస్తుందని పెనుమంత్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనుం సూర్యనారాయణ, గ్రామ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మారిశెట్టి శ్రీను, శీలి పెద్దబ్బులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని ఆదరించాలి



పెదగరువులో ప్రచారం చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని మంగళవారం పాలకొల్లు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ, అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మండలంలోని పెదగరువులో మండల పరిషత్‌మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు మంగళవారం ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఊటాల చిట్టిరాజు ఉన్నారు. అలాగే పట్టణంలోని 28వ వార్డులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అడబాల వెంకటరమణ ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. వార్డు ఇన్‌చార్జ్ శీలం సూరిబాబు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయసరిత, పెచ్చెట్టి లక్ష్మీ విమల తదితరులు పాల్గొన్నారు.

గుడాల గోపిని భారీ మెజార్టీతో గెలిపించాలి



సబ్బేవారిపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

పోడూరు: పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. అప్పన్నచెరువు శివారు సబ్బేవారిపేట గ్రామంలో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ జిల్లా కార్యదర్శి దేవ రాజేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తొండా శ్రీనివాస్, గ్రామకమిటీ అధ్యక్షుడు గుమ్మాపు రాంబాబు, పెదపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

- దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే ప్రత్యేక వైద్య సేవలు
- ఊరూవాడా జల్లెడపట్టి రోగుల గుర్తింపు
- ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలకు సిఫార్సు



లయన్స్‌నగర్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడానికి సిద్ధంగా ఉన్న వైద్య సిబ్బంది (ఫైల్)

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలు చేస్తున్నారు. గత ఏడాది జనవరి నుంచి ట్రయల్ రన్‌గా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసి అక్కడ నుంచి ఈ సేవలను నిరంతరం కొనసాగిస్తున్నారు. ఒక మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, డీఈవో, ఆశ వర్కర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆ గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి గ్రామంలో నెలకి రెండు ప్రత్యేక ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతి నెలా ఒక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు రోగులకు అందిస్తున్నారు. ఉదయం సమయంలో సాధారణ రోగులను పరీక్షిస్తున్నారు. బీపీ, సుగర్, హెచ్‌బీ, హెచ్‌సీజీ, యూరిన్ టెస్ట్, బ్లడ్ సుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, టీబీ తదితర పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ప్రతి శిబిరంలోనూ రూ.10వే లకి పైగా విలువైన మందులు రోగులకు అందజేస్తున్నారు.

దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు....

ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరంలో మధ్యాహ్నం నుంచి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగుల ఇళ్లకు వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ గుండె, కిడ్నీ, ఎముకలు, నరాలు, ఇతర క్యాన్సర్ శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులను ప్రత్యేకంగా పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్నారు. అలాగే ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరంలో శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఇలా
(2023 మే నెల నుంచి 2024 ఏప్రిల్ వరకు)

పీహెచ్‌సీ	గ్రామాలు	శిబిరాలు	రోగులు
లంకలకోడేరు	10	20	53,940
పాలకొల్లు	11	22	45,180
మేడపాడు	10	20	50,484
యలమంచిలి	08	16	47,004
దొడ్డిపట్ల	09	18	54,576
పోడూరు	08	16	46,896



నాగరాజు పేటలో బ్రెస్ట్ క్యాన్సర్ శస్త్ర చికిత్స చేయించుకున్న రోగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది (ఫైల్)



యాళ్లవానిగరువులో ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరంలో రోగికి వైద్య సేవలందిస్తున్న దృశ్యం



పెదగరువులో మంచినీటి సరఫరా సమయంలో క్లోరినేషన్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సీఎం జగన్‌ని ఆశీర్వదించాలి



భగ్గేశ్వరంలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న మేకా శేషుబాబు, గుడాల గోపి భార్య మంగతాయారు

పాలకొల్లు అర్బన్: సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు కోరారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరంలో మంగళవారం శేషుబాబు, గుడాల గోపి భార్య మంగతాయారు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకి ఓటు వేయాలని కోరారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు అసెంబ్లీ టికెట్లు కేటాయించి సామాజిక న్యాయం పాటించారన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు కూడా సంక్షేమ ఫలాలు అందించిన సీఎం జగన్‌కి అండగా నిలవాలని కోరారు. గోపి భార్య మంగతాయారు మహిళలకు బొట్టు పెట్టి తన భర్తను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చెరుకూరి సత్యవర్మ (పండురాజు), మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ నాయకులు గొర్ల శ్రీనివాస్, పెచ్చెట్టి శ్రీనివాస్, జోగి శ్రీనివాస్, శిద్దాని సాగర్, మాజీ సర్పంచ్ శిద్దాని శివకోటయ్య, అందె మార్కొండేయులు, పెచ్చెట్టి త్రిమూర్తులు, అందె అంకయ్య, కడలి రామకృష్ణ, పెచ్చెట్టి కృష్ణాజి తదితరులు పాల్గొన్నారు.

రైతులను భయపెట్టిన వర్షం



ధాన్యం రాశుల్లోకి నీరు వెళ్లకుండా రక్షణ కల్పిస్తున్న రైతులు

పెనుమంత్ర: మండలంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన మోస్తరు వర్షం ప్రజలకు ఉక్కపోతనుంచి ఉపశమనం కల్గించినప్పటికీ రైతులు మాత్రం పరుగులు పెట్టించింది. కొద్దిపాటి గాలితో కూడిన వర్షంతో బయట చల్లబడిన అప్పటి వరకు మండిన ఎండతో భవనాల గదుల్లో వేడి తగ్గలేదు. దీంతో మధ్యాహ్నం 3 గంటలకు నిలిచిపోయిన విద్యుత్ రాత్రి 8 గంటలైనా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొద్దిపాటి వర్షం వల్ల రైతులకు పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ వేగంగా జరుగుతున్న మాసూళ్లకు మాత్రం మంగళవారం అంతరాయం కలిగింది. మండలంలో 12 వేల ఎకరాల్లో వరినాట్లు వేయగా 41 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ అవుతుందని అంచనా వేశామని మండల వ్యవసాయ శాఖ అధికారి జోష్యుల తెలిపారు. ఇప్పటి వరకు రైతులకు చెందిన 18350 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించగా 8 వేలమెట్రిక్ టన్నులు కళ్లాల్లోను 15 వేల మెట్రిక్ టన్నుల వరకు కోతలు కోయాల్సి ఉందన్నారు. మాముడూరు, నత్తారామేశ్వరం, జుత్తిగ, వెలగలవారిపాలెం, పెనుమంత్ర, పాలమూరు గ్రామాల్లో నాట్లు ఆలస్యం కావడంతో ఇంకా 50 శాతం కోతలు కోయాల్సి ఉందన్నారు.

కాపులకు సముచిత స్థానం



పెనుగొండలో కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాపుల అభ్యున్నతికి కృషి చేశామని, రాబోయే రోజుల్లో మరింత సముచిత స్థానం కల్పిస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం రాత్రి పెనుగొండ జవ్వాది వారి వీధిలో నిర్వహించిన కాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన కాపుల ఆత్మీయ సమావేశానికి భారీ సంఖ్యలో కాపులు తరలివచ్చారు. 12 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన పెనుగొండలో కాపుల కమ్యూనిటీ భవనం పూర్తి చేశామని, ఆచంటలో రూ.2 కోట్లుతో కాపుల కమ్యూనిటీ భవన నిర్మాణం జరుగుతుందని, పెనుమంచిలిలోనూ రూ.65 లక్షలతో నిర్మాణం జరుగుతుందని, పోడూరులోనూ కాపుల కమ్యూనిటీ భవన పనులు ప్రారంభించామన్నారు. గత ప్రజా ప్రతినిధులు శిలాఫలకాలకే కాపుల భవనాలు పరిమితం చేస్తే తాను ఇచ్చిన మాటకు కట్టుబడి పూర్తి స్తున్నానని వివరించారు. త్వరలో చెరుకువాడలోనూ భారీ కాపు కమ్యూనిటీ భవన నిర్మాణం చేపడతామని భరోసా ఇచ్చారు.

నాలుగో తరానికి సముచిత పదవి

జవ్వాది వంశంలో నాలుగో తరానికి సముచిత పదవిని అలంకరింపజేయడానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. స్వర్గీయ చినబాబు ప్రోద్బలంతోనే ఆచంట శాసన సభ్యుడిగా పోటీ చేశానని తెలిపారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారన్నారు. చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకొన్నారన్నారు. కొందరు కాపులను రెచ్చగొట్టి లాభం పొందుదామని భావిస్తున్నారని వారి మాటలకు మోసపోవద్దన్నారు. ఆచంట నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కాపు కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు.



పెనుగొండలో శ్రీరంగనాథరాజు, వంక రవీంద్ర, నానాజీలను సత్కరిస్తున్న దృశ్యం



పెనుగొండలో కాపుల ఆత్మీయ సమావేశానికి హాజరైన కాపులు

శ్రీరంగనాథరాజుకు అండగా నిలవాలి

స్వర్గీయ చినబాబుకు అత్యంత ఆత్మీయుడైన శ్రీరంగనాథరాజుకు కాపులందరూ అండగా నిలిచి గెలిపిస్తే పరోక్షంగా తనను గెలిపించినట్లేనని డీసీసీబీ డైరెక్టర్, చినబాబు తనయుడు కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు అన్నారు. కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని తెలిపారు. కాపు సోదరులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్ర, డీసీసీబీ డైరక్టరు కూనపరెడ్డి నానాజీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన రామయ్య, ఎన్నికల పరిశీలకుడు దిరిశాల కృష్ణ శ్రీనివాస్, వైఎస్ ఎంపీపీ తోలేటి శ్రీను ఉప సర్పంచ్ ఆకెట్టి వరలక్ష్మీ చంటి, సర్పంచ్‌లు యర్రంశెట్టి బుజ్జి, మాకినీడి కోట సత్యనారాయణ,తోట వెంకటరత్నం, గాజుల బులిపుల్లారావు, సుంకర నాగబాబు, కొమ్మిరెడ్డి హిమదత్తు, కాకిలేటి బాపిరాజు, నక్క కృష్ణ, కూనపరెడ్డి జయరాజు, ముచ్చెర్ల శ్రీరామ్, ఎంపీటీసీ సభ్యురాలు మద్దింశెట్టి లక్ష్మీ, బళ్ల విజయలక్ష్మీ, ముత్యాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



వడ్డిలంకలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు



మట్టవానిచెరువులో ప్రచారం చేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: పాలకొల్లులో ఈసారి ఫ్యాన్ గాలి ప్రభంజనం సృష్టించడం ఖాయమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ధీమా వ్యక్తం చేశారు. యలమంచిలి మండలంలోని ఇలపకుర్రు, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, మట్లపాలెం, కట్టుపాలెం, పెనుమర్రు గ్రామాలలో జీపు యాత్ర, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న గోపి మధ్యలో జీపు దిగి నేరుగా ఓటర్లను కలసి జగనన్నను ముఖ్యమంత్రిని చేయవలసిన ఆవశ్యకతను ఓటర్లకు వివరించారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. ఎమ్మెల్యేగా తనను, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. ర్యాలీలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, జేసీఎస్ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, పార్టీ నాయకులు చల్లా విశ్వేశ్వరరావు, బోనం బులివెంకన్న, బొంతు వెంకటకర్ణారెడ్డి, కామిశెట్టి సాయిబాబా, చెల్లింకుల లక్ష్మి, కవురు గోపి, ఆరుమిల్లి లక్ష్మణరావు, ఓదూరి బాలు, మంద హరికుమార్, వీరా ఉమా శంకర్, మోకా ప్రేమ్‌చంద్, కడలి నరసింహస్వామి, ముప్పిడి కుమార్, పితాని శ్రీనివాస్, కుక్కల బాలచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనుమంత్ర: పెనుమంత్ర, గరువు గ్రామ పంచాయతీ పరిధిలో టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా సోమవారం రాత్రి హనుమాన్ గుడి గోడను చిన కారు ఢీకొట్టిన ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన ముగ్గురు వ్యక్తులను 108 వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలించగా శిక్ష పొందుతున్నారు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఐదుగురు వ్యక్తులు సోమవారం పేరుపాలెం బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇ.ప్రవీణ్‌కుమార్, కె.సాయి, టి.కృష్ణ అనే యువకులు గాయపడ్డారు. ప్రమాదం నుంచి పెనుమంత్రకు చెందిన నల్లమిల్లి రామిరెడ్డి, మరోసైక్లిస్టు తృటిలో తప్పించుకున్నారు. వీరు ఇరువురు తమ సైకిల్, మోటారు సైకిల్ ను రోడ్డు పక్కగా ఆపి పక్కనే ఉన్న కిళ్లీషాపులో సరుకులు కొనుగోలు చేస్తున్నారు. అందే సమయంలో వేగంగా దూసుకొచ్చిన కారు ఈ రెండు సైకిల్, మోటర్ సైకిల్‌ను ఈడ్చుకుంటూ వెళ్లి గుడి గోడను ఢీకొట్టడంతో రెండు వాహనాలు కారు కింద పడి నుజ్జునుజ్జయ్యాయి.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతం



ఆచంటలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ రెండో రోజు మంగళవారం 80 శాతం దాటిందని నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామి నాయుడు తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆచంటలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవడానికి మూడో రోజు బుధవారం అవకాశం కల్పించినట్లు ఆర్‌ఓ స్వామి నాయుడు తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద తహసీల్దార్లు ఐవీ శెట్టి, కె.లక్ష్మీ కల్యాణి, ఆర్‌వీవీ రోహిణీ దేవి, ఎంపీడీఓ పి.నరసింహప్రసాద్, ఎస్.శ్రీనివాస్ దొర, పి.పద్మజ తదితరులు ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నియోజకవర్గంలో రెండవ రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. స్థానిక ఎంఎంకేఎన్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 674 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటిరోజు 1357 మంది ఓటు వినియోగించుకున్న విషయం తెలిసిందే. మొత్తం 2113 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు గాను 2031 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇంకా 82 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. బుధవారం 8వ తేది సాయంత్రం 5 గంటలతో పోస్టల్ ఓటింగ్ ముగియనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ బీఎస్ నారాయణరెడ్డి తెలిపారు.